

గంజాయి నిందితుల ఆస్తులపై విచారణ

గంజాయి నిందితుల ఆర్థిక మూలాలపై విచారణ జరిపి ఆస్తులను ఫ్రీజ్ చేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. - 8లో



జనసేన నాయకుడి దౌర్జన్యం

మొయిద నారాయణపట్నం గ్రామంలో జనసేన మండలాధ్యక్షుడు అచ్చిం నాయుడు ఓ రైతు కుటుంబంపై దౌర్జన్యం చేశాడు. - 8లో



విద్యను జాతీయం చేయాలి

ఆటంబాంబులు, సునామీల కంటే పేపర్ లీకేజ్ సమాజానికి, వ్యవస్థకు ఎంతో హానికరం అని పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి అన్నారు. - 8లో

అదిగో చినుకు.. ఊరిస్తోంది ఇంకా!

- జూలై సగం గడిచినా ఇంకా లోటు వర్షపాతమే..
- ఖరీఫ్ పనులకు వెనకడుగు వేస్తున్న రైతులు
- ఎండిపోతున్న ఆశలు

సాక్షి, పార్వతీపురం మన్యం:

ఖరీఫ్ పనులకు కొద్దిరోజుల ముందు వర్షాలు వారం రోజులపాటు కురిస్తే రైతులు మురిసిపోయారు. వ్యవసాయ పనులు మొదలు పెట్టేశారు. తీరా.. ఇప్పుడు వానలు ముఖం చాటేశాయి. వేసవిని తలపిస్తూ ఎండలు మండుతున్నాయి. ఉదయం ఎండ వేడిమి.. సాయంత్రం నాలుగు చినుకులు.. రాత్రయితే ఉక్కపోత.. ఇదీ జిల్లాలో పరిస్థితి. కొద్దిరోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలతో నారుమడులు ఎండుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చి రైతులు వరి నారుమడులు తడుపుతున్నారు. జిల్లాలో ఈ నెల 16న 19.1 మి.మీ. సగటు వర్షం కురిసింది. ఇందులో మక్కువ, సీతానగరం, పాలకొండ, కొమరాడ, బలిజిపేట ప్రాంతాల్లో మోస్తరు వర్షపాతం నమోదు కాగా.. కురుపాం, జియ్యమ్మవలస, పార్వతీపురం, పాచిపెంట తదితర మండలాల్లో చినుకు జాడలేదు. జిల్లాలో ఈ ఏడాది జూన్ నుంచి జులై 16వ తేదీ వరకు 247.6 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. కేవలం 201 మి.మీ. కురిసింది. గతేడాది ఇదే సమయంలో 264 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. రుతు పవనాలు తొందరగానే ప్రవేశించాయని.. ఇంక వానలే వానలని అనుకున్న రైతులకు నిరాశే మిగిలింది.



నారు సిద్ధమైనా నీరు లేక నాట్లు వేయలేని పరిస్థితి

ఖరీఫ్‌పై ప్రభావం

జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 2.20 లక్షల ఎకరాల్లో వరితోపాటు, ఇతర ప్రధాన పంటలు సాగవుతాయి. ప్రస్తుతం పంటలకు నీరు అవసరం. కొన్ని మండలాల్లో అడపాదడపా వర్షం కురుస్తున్నా.. మరికొన్ని మండలాల్లో పూర్తిగా ఎండ కాస్తోంది. నీటి వనరులున్నా.. ప్రభుత్వ వైఫల్యం కారణంగా సాగుకు ఇవ్వలేని పరిస్థితి. ప్రస్తుతం ఖరీఫ్‌కు సంబంధించి నీరు రాకపోతే నారుమడులు వేసిన రైతులు నష్టపోతారు. నీటి వనరులున్న చోటు ఉడుపులు అవుతున్నాయి. వర్షాలు ఆలస్యమై పైరు దెబ్బతింటుంది. దీనివల్ల వెదలు జల్లడం లేదు. సాధారణంగా ఈ సమయంలో ఉభాలకు పూర్తిస్థాయిలో సిద్ధమవ్వాలి. దమ్ములు కూడా మొదలవ్వాలి. మరోవైపు యూరియా కొరత వేధిస్తోంది. ఈ సమయంలో యూరియా అందకపోతే మొక్క ఎదుగుదల మీద ప్రభావం పడుతుంది. ఓ వైపు వర్ష ప్రభావం, ఇంకోవైపు ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వర్షపాతం ఇలా...

గత ఏడాది జూన్, జూలై నెలల్లో (ఇదే సమయానికి) 247.6 మి.మీ సాధారణ వర్షపాతానికి గాను 264 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అంతకు ముందు 2023లో ఇదే సమయానికి 307.01 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది.

ఈ ఏడాది జూన్, జులై నెలల్లో నమోదైన సగటు వర్షపాతం వివరాలు

మండలం	సాధారణం	కురిసింది(మి.మీ)
వీరఘట్టం	247.5	218.9
సీతంపేట	322.2	123
భామిని	263.3	99.8
పాలకొండ	246.7	213.6
కొమరాడ	271.2	282.7
జీఎల్‌పురం	248.8	151.5
కురుపాం	209.9	229.3
జియ్యమ్మవలస	253.9	298.4
గరుగుబిల్లి	255.8	106.8
పార్వతీపురం	264.3	321.3
మక్కువ	232.8	203.8
సీతానగరం	237.3	205.6
బలిజిపేట	202.9	224.2
సాలూరు	235.7	192.7
పాచిపెంట	222	139.1



అరకొర నీటితోనే దమ్ము

తెల్ల కాగితం చూపించేసి.. అభిప్రాయాలు చెప్పేయమంటారా?



- జీఓ 3కి ప్రత్యామ్నాయం అంటే ఏమిటి?
- గిరిజనులకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం లేదా?
- మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర

సాక్షి, పార్వతీపురం మన్యం:

జీవో నంబర్ 3పై స్పష్టత ఇచ్చాకే గిరిజనుల, గిరిజన సంఘాల అభిప్రాయాలను తీసుకోవాలని మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్.భార్గవి జీవో నంబరు 3, గిరిజన చట్టాలపై గురువారం పార్వతీపురం ఐటీడీఏ వద్ద వివిధ సంఘాలతో సమావేశం కానున్నారని.. ఇక్కడైనా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు, తర్వాత జీవో నంబరు 3ను పునరుద్ధరిస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్, మంత్రి సంధ్యారాణి పదేపదే చెప్పడం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఈ విషయాన్ని పొందరుపరిచారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రత్యామ్నాయ జీవో అని చెబుతూ.. దానికి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు ఇవ్వాలంటున్నారని తెలిపారు. అసలు ప్రత్యామ్నాయ జీవోలో ఏముందో, ఎలా ఉంటుందో చెప్పకుండానే గిరిజనులు, గిరిజన సంఘాలు ఏం అభిప్రాయం చెబుతారని ప్రశ్నించారు. 'గిరిజనులంతా అమాయకులు కదా.. అందుకే మిమ్మల్ని నమ్మి ఓట్లేశారు. వారికి ఏం చెప్పినా చెల్లిపోతుంద'న్న ఆలోచనలో కూటమి నాయకులు ఉన్నట్లు ఉన్నారని ఆరోపించారు.

న్యాయస్థానంలో డిస్మిస్ అయిందని తెలిసి హామీ ఇవ్వలేదా?

గిరిజనులకు రిజర్వేషన్లలో న్యాయం చేద్దామనే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భావించారని రాజన్నదొర తెలిపారు. జీవో 3కి వ్యతిరేకంగా న్యాయస్థానంలో తీర్పు వస్తే రివ్యూ పిటిషన్ వేశామని గుర్తు చేశారు. ఏప్రిల్, 2022లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కూడా తయారు చేశామని.. నాటి అడ్వకేట్ జనరల్ సలహాలు కూడా తీసుకున్నామని చెప్పారు. రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నప్పుడు వేస్తే కోర్టు ధిక్కారం అవుతుందని ఏజీ సలహా ఇవ్వడంతో ఆ ప్రక్రియ అక్కడ ఆగిందని గుర్తు చేశారు. గత ఎన్నికలకు ముందే 2024 ఏప్రిల్‌లో రివ్యూ పిటిషన్‌పై న్యాయస్థానంలో తీర్పు వ్యతిరేకంగా వచ్చిందన్నారు. డిస్మిస్ అయిందని తెలిసి కూడా జీవో నంబరు 3ను పునరుద్ధరిస్తామని కూటమి నాయకులు ఎలా హామీ ఇచ్చారని ప్రశ్నించారు. నూటికి నూరు శాతం గిరిజనులకు రిజర్వేషన్లు ఇస్తామని ఒప్పుకున్నట్లే కదా? అని అన్నారు. మరి కేంద్రానికి ఎందుకు పంపలేదని, దాగుడు మూతలు ఆడుతున్నారా? అని సందేహం వ్యక్తం చేశారు.

గిరిజనులతో ఆటలాడుకుంటున్నారా?

ప్రత్యామ్నాయ జీవోలో ఏ విషయమూ స్పష్టంగా చెప్పకుండా సలహాలు అడిగితే ఎలా ఇవ్వగలరని రాజన్నదొర అన్నారు. గిరిజనులతో ఆటలాడుకుంటున్నారా? అని ప్రభుత్వాన్ని, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని ప్రశ్నించారు. గిరిజన సంఘాల నాయకులు ఈ విషయాన్ని గ్రహించాలని సూచించారు. ముందుగా స్పష్టత తీసుకున్న తర్వాతే అభిప్రాయాలను వ్యక్తపరచాలని తెలిపారు. తెల్ల కాగితం చూపించి, దాన్ని చూసే అభిప్రాయాలు చెప్పాలన్న తీరులో ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. తనను కలిసిన గిరిజన సంఘాలతో ఇదే విషయం స్పష్టం చేశానని రాజన్నదొర అన్నారు.

బ్యాడ్మింటన్ కోచ్‌గా వరప్రసాద్



కనకల వరప్రసాద్

సాలూరు రూరల్: సాలూరు మండలం మొఖాసా మామిడిపల్లికి చెందిన కనకల వరప్రసాద్ ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ఇండోనేషియాలోని సోలో సిటీలో జరగనున్న ఏషియన్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో తలపడనున్న భారతదేశ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం అస్సాంలో కోచ్‌గా స్థిరపడ్డారు. కోచ్‌గా ఎంపికైన వరప్రసాద్‌కు మామిడిపల్లి గ్రామంలోని కుటుంబ సభ్యులతో పాటు సర్పంచ్, గ్రామస్తులు అభినందించారు.

న్యూస్‌రీల్

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

పాలకొండ: సమస్యలు పరిష్కరించాలంటూ నగర పంచాయతీ పరిధిలోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తలపెట్టిన సమ్మెలో భాగంగా బుధవారం అర్ధనగ్నప్రదర్శన చేపట్టారు. కనీసవేతనం చెల్లించాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, గతంలో సమ్మె చేపట్టిన సందర్భంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి

పార్వతీపురం టౌన్: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అరకు ఎంపీ తనూజారాణి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. పల్లెలు, పట్టణాల్లోని సమస్యలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. బెలగాం రైల్వే గేటు సమస్యను పరిష్కరించాలని డీఆర్ఎంకు ఫోన్‌చేసి తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ బి. రవికుమార్, సిద్ధా జగన్నాథం, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.2,47,455లు




హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచి జూలై 16 వరకు భక్తులు హుండీలలో వేసిన కానుకలను బుధవారం లెక్కించారు. మొత్తం రూ.2,47,455ల ఆదాయం వచ్చినట్టు ఈఓ బి.శ్రీనివాస్ తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.శ్యామ్‌ప్రసాద్ నేతృత్వంలో సాగిన హుండీల లెక్కింపు కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గవిడి నాగరాజు, లెంక చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శుల వివరాల రిజిస్ట్రేషన్‌కు ఆదేశం

విజయనగరం అర్బన్: పీ-4 కింద పేదలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శుల వివరాలను వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. వెబెక్స్‌లో పీ-4, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ఎరువుల సరఫరా, సీజనల్ వ్యాధుల వ్యాప్తి తదితర అంశాలపై జిల్లా స్థాయి, మండల అధికారులతో కలెక్టర్ బుధవారం మాట్లాడారు. పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య పనులు, ఎరువుల సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

700 క్యూసెక్కుల నీరు విడుదల



కుడి ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఏఈ నితిన్ తెలిపారు. ఇప్పటివరకు 600 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు సరఫరా చేయగా, కాలువ సామర్థ్యమేరకు తాజాగా మరో వంద క్యూసెక్కుల నీటిని పెంచామన్నారు.

పోలీస్ సిబ్బందికి వైద్యపరీక్షలు

విజయనగరం క్రైమ్:

రాష్ట్ర డీజీపీ హరీష్కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని, సేవల తీరును ఆయన పరిశీలించారు. ఉద్యోగుల ఆరోగ్యమే లక్ష్యంగా అధికారి నుంచి హోంగార్డు వరకు అందరికీ వైద్యపరీక్షలు చేయిస్తామన్నారు. సుగర్, రక్తం, లిపిడ్ ప్రొఫైల్ (కొలిస్ట్రాల్), సీరం క్రియేట్ (కిడ్నీ), ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన మందులతో పాటు వైద్యచికిత్స అందిస్తామని చెప్పారు. దీనికోసం ప్రత్యేకంగా వైద్యులను ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న మొత్తం 2000 మందికి ఈ నెలాఖరులోగా వైద్య పరీక్షలు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని, ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీస్ ఉద్యోగుల సౌలభ్యం కోసం జిల్లా కేంద్రంలోని మెడికవర్, స్కాన్యూటెక్జోను, బొబ్బిలిలోని క్వీన్ ఎన్ఆర్ఐ, రాజాంలోని జీఎంఆర్ వరలక్ష్మి కేర్ ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, అదనపు ఎస్పీ (ఏఆర్) జి.నాగేశ్వరరావు, వైద్యులు మల్లికార్జున రెడ్డి, అఖిల్, రాజేష్, వి.గోవర్ధన్, సిరి కృష్ణ, ఏఆర్ డీఎస్పీ వై.రవీంద్ర రెడ్డి, ఎస్బీ సీఐలు పాల్గొన్నారు.



డీపీఓలో పోలీసులకు నిర్వహిస్తున్న వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు

టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి

- టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్

నెల్లిమర్ల: టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని టిడ్కో రాష్ట్ర చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని టిడ్కో కాలనీ సముదాయాన్ని ఎమ్మెల్యే లోకం నాగ మాధవితో కలిసి బుధవారం సందర్శించారు. నిర్మాణంలో ఉన్న ఫ్లాట్లను పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులను ఆరాతీశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల నిర్మాణం కేవలం ఒక ప్రాజెక్టు మాత్రమే కాదని, పట్టణాల్లో సొంతిల్లు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న బృహత్తర పథకమన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, నాయకులు జనా ప్రసాద్, అప్పికొండ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయంలో మక్కువకు గుర్తింపు

మక్కువ: వ్యవసాయ పరిశోధనల్లో 'మక్కువ'కు గుర్తింపు లభించింది. మండలంలోని చప్పబుచ్చమ్మపేటకు చెందిన వైకుంఠపు పాపారావు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐసీఏఆర్)లో వ్యవసాయశాస్త్రవేత్తగా ఉద్యోగం చేస్తూ చేసిన పరిశోధనలు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చాయి. రాష్ట్రీయకృషి విజ్ఞాన్ పురస్కార్-2025 వరించింది. ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చేతులమీదుగా పాపారావు బుధవారం అవార్డు అందుకున్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ (ఐసీఏఆర్) స్థాపన దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలకు అవార్డులను ప్రదానం చేశారు.

ఆనందంగా ఉంది

మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు వైకుంఠపు అప్పలనాయుడు, పార్వతి వ్యవసాయదారులు. చిన్నప్పటి నుంచి వ్యవసాయం అంటే మక్కువ. వ్యవసాయ శాస్త్రవేత్తగా 2020 సంవత్సరంలో ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఐసీఏఆర్‌లో శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తిస్తున్నాను. వ్యవసాయ పరిశోధనలకు రాష్ట్రీయ కృషి విజ్ఞాన్ పురస్కారం వరించడం గౌరవంగా భావిస్తున్నా.

– డాక్టర్ వైకుంఠపు పాపారావు



అవార్డుతో వ్యవసాయ శాస్త్రవేత్త పాపారావు

సూపర్ సిక్స్‌లో కూటమి డకౌట్



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- అరకు ఎంపీ తనూజారాణి

బలిజిపేట: ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి నేతలు డకౌట్ అయ్యారని అరకు ఎంపీ తనూజారాణి అన్నారు. బలిజిపేటలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ మండల విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా సుపరిపాలన లేదు సరికదా అక్రమాలు, అన్యాయాలు, కేసులు, గొడవలతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారిందన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలను చెప్పినట్టుగా అమలుచేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరచకుండా మహిళలు, నిరుద్యోగులు, యువత, రైతులు, విద్యార్థులు ఇలా అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తోందని, దీనిని గడపగడపకు వెళ్లి వివరించాలన్న ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. దీనిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా దొరకడం లేదని, రైతుకు ఇస్తామన్న ఆర్థిక సాయం కూడా ఇవ్వలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం ఎండమావిగా మారిందన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ అర్హులందరికీ కాకుండా కొందరికే వర్తింపజేశారన్నారు. హామీల అమలుపై కూటమి నేతలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పి.మురళీకృష్ణ, తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి శ్రీరంగరాజపురం వాసులు

బలిజిపేట: మండలంలోని నారన్నాయుడువలస పంచాయతీ శ్రీరంగరాజపురం నుంచి 70 కుటుంబాల వారు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో అరకు ఎంపీ తనూజారాణి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలన నచ్చక వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. అధికారం చేపట్టిన ఏడాదికే టీడీపీని వీడుతున్నారంటే వారి సుపరిపాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎస్.చిన్నారావు, కె.అప్పలనాయుడు, వెంకటరమణ, పి.త్రినాథరావు, కె.గురుమూర్తి, పి.గణపతి, తిరుపతిరావు, కె.శ్రీనివాసరావు, పి.సూర్యనారాయణ, రమేష్, సత్యం, లక్ష్మణరావు, ఎ.రమేష్, కె.శంకరరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించిన ఎంపీ తనూజారాణి

క్లుప్తంగా

విద్యుత్ స్టేవైరు తగిలి గేదె మృతి



గేదె కళేబరం

సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామంలో ఇళ్ల సర్వీసుల నిమిత్తం విద్యుత్ స్తంభానికి సపోర్టుగా వేసిన విద్యుత్ స్టే వైరు తగిలి రూ.80వేల ఖరీదైన గేదె మృతిచెందింది. ఈ ఘటనపై స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాడి రైతు గుంట్రెడ్డి అప్పలనాయుడికి చెందిన గేదెను మేతకు తోలి ఇంటికి తీసుకువచ్చి ఇంటి ముందున్న తాడుకు కట్టాడు. వర్షం కురుస్తున్న సందర్భంగా నేల నాని పోవడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి బిగించిన స్టేవైరుకు పింగాణీ లేక పోవడంతో స్టే వైరుకు ప్రవహించిన విద్యుత్ గేదె మెడ, కొమ్ముకు తగలడంతో మృతిచెందినట్లు తెలియ జేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఎయిర్‌స్ట్రిప్ తుప్పల్లో కుళ్లిన వ్యక్తి మృతదేహం

బాడంగి: మండలంలోని ముగడ పంచాయతీ పరిధి విమానాశ్రయం రన్‌వే గచ్చు తుప్పల్లో కుళ్లిపోయిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు బుధవారం కనుగొన్నారు. ఈ విషయాన్ని వీఆర్‌ఓ ద్వారా పోలీసులకు సమాచార మివ్వగా ఎస్సై తారకేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహం గుర్తు పట్టలేని విధంగా కుళ్లిపోయి కపాలం, ఎముకలు బయటకు కనిపించడంతో ఆ వ్యక్తి సుమారు 15రోజులక్రితమే చనిపోయి ఉంటాడని, ఆయన వయస్సు సుమారు 50-55మధ్య ఉంటుందని అంచనాకు వచ్చారు. తొలుత అనుమానాస్పద మృతిగా భావించి విజయనగరం నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి పరిశీలించగా మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో వారు కూడా చేసేది లేక తిరుగుముఖంపట్టారు. మృతదేహాన్ని ఆస్పత్రికి కూడా తీసుకువెళ్లలేని పరిస్థితుల్లో అక్కడికే స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి నాగేశ్వరావును రప్పించి పోస్టుమార్టం చేయించి సమీపంలోనే జేసీబీతో గొయ్యితీసి పూడ్చిపెట్టారు. అయితే కొద్దరోజులక్రితం మతిస్థిమితం లేని బిచ్చగాడు ఇటువైపు తిరుగుతుండేవాడని పలువురు చెప్పగా అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

14మంది జూదరుల అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన జూదరులు

బొండపల్లి: మండలంలోని వెదురువాడ గ్రామం వద్ద జూదం ఆడుతుండగా 14మందిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. వారి నుంచి రూ.లక్షా 1170 నగదు, 9సెల్‌ఫోన్‌లు, 14మోటార్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. పట్టుకున్న వారి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

గంజాయి నిందితుల ఆస్తులపై విచారణ

- ఎస్పీ వకుల్ జిందల్
- చింతలవలస వద్ద 37.550 కేజీల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్పీ వకుల్ జిందల్ తదితరులు

డెంకాడ: గంజాయి నిందితుల ఆర్థిక మూలాలపై విచారణ జరిపి ఆస్తులను ఫ్రీజ్ చేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఈ మేరకు డెంకాడ మండలంలోని పినతాడివాడ వద్ద ఉన్న భోగాపురం సీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడారు. మండలంలోని చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ మెయిన్‌గేట్ సమీపంలో 26వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం కారులో తరలిస్తున్న 37 కేజీల 550 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు చెప్పారు. కచ్చితమైన సమాచారంతో డెంకాడ పోలీసులు, ఈగల్ పోలీసులు సంయుక్తంగా ఏపీఎస్పీ బెటాలియన్ మెయిన్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేస్తుండగా విజయనగరం నుంచి విశాఖ వెళ్తున్న కారులో 37.550 కేజీల గంజాయి పట్టుబడిందని చెప్పారు. ఒడిశాలో కారులో గంజాయిని లోడ్ చేసి విశాఖకు తరలిస్తుండగా పట్టుబడ్డారని తెలియజేశారు. కారులో గంజాయి తీసుకువెళ్తున్న ఒడిశాకు రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లాకు చెందిన బసుదేవ్ సిపా అలియాస్ భాస్కర్ గొల్లారి, అజయ్ గంటలను పట్టుకున్నామని తెలిపారు. వారిద్దరినీ అదే రాష్ట్రానికి చెందిన రాజేష్ అలియాస్ గణేష్ అనే వ్యక్తి రూ.5వేలకు ఎంగేజ్ చేసుకున్నాడని చెప్పారు. రాజేష్‌ను కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. ఒడిశా నుంచి వివిధ మార్గాల్లో గంజాయిని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. ఒడిశా నుంచి గంజాయిని రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకునేందుకు పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అయితే నిందితులు చెక్‌పోస్టులున్నందున లూప్ లైన్లలో రవాణా చేస్తున్నారన్నారు. వాటిపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఈ మధ్య కాలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే మీదుగా రవాణా చేస్తున్నట్లు గుర్తించామని, దీంతో ఈ ప్రాంతాల్లో కూడా పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి రవాణా చేసినా, నిల్వ ఉంచినా, అమ్మినా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పట్టుబడిన నిందితులపై గంజాయి కేసుతోపాటు వారి ఆర్థిక మూలలపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విజయనగరం పట్టణంలో గంజాయి నివారణకు పూర్తిగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. దీనిలో భాగంగా పలువురిని పట్టుకుని కేసులు పెట్టి అరెస్టు చేయడంతో పాటు కఠిన చర్యలు కూడా తీసుకున్నామన్నారు. కేసులో క్రియాశీలకంగా పని చేసిన భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్సై ఎ.సన్యాసినాయుడు, సిబ్బంది, ఈగల్ టీం సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రికార్డుల పరిశీలన

డెంకాడ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ సందర్శించిన సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. బ్లాక్‌స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసులు త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లో వివిధ రికార్డులను, సీడీ ఫైల్స్, జనరల్ డైరీ, బెయిల్ బుక్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్సై ఎ.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బైక్స్ చోరీకి పాల్పడిన నిందితుల అరెస్టు



నిందితులు, దొరికిన వాహనాలతో ఎస్పీ వకుల్ జిందల్, సిబ్బంది

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిళ్లను అపహరించిన ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్‌లో ఎస్పీ వకుల్ జిందల్ విలేకరుల ముందు ఇద్దరు నిందితులను ప్రవేశ పెట్టారు.ఈ కేసుకు సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ విజయనగరంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన ఉప్పడాల రాము అలియాస్ డీజే, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం ముద్దాడపేటకు చెందిన ముద్దాడ నవీన్ అలియాస్ టైసన్ (19)తో కలిసి 11రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్స్, 2 యమహా మోటార్ సైకిళ్లను మారుతాళాలతో దొంగిలించారన్నారు. తరచూ విజయనగరం వన్ టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్స్ చోరీకి గురవుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని వాటికి కారకులైన నిందితులను అరెస్టు చేసేందుకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు బైక్ దొంగతనాలపై తన సిబ్బందితో నిఘా పెట్టారన్నారు. ఈ క్రమంలోనే వీటీ అగ్రహారం బీసీ కాలనీలో నివాసం ఉంటున్న (ఎ1) ఉప్పడాల రాము అలియాస్ డీజేను అరెస్టు చేశామని తెలిపారు. గతంలో కూడా ఉప్పడాల రాము అలియాస్ డీజేపై బైక్ చోరీలకు పాల్పడినట్లు పలు కేసులున్నాయన్నారు. నిందితుడు రాము ఇటీవల జైలు నుంచి విడుదలైన తరువాత మళ్లీ బైక్ చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. ఎ1 ఉప్పడాల రాము నుంచి 7 మోటార్ సైకిల్స్‌ను, ఎ2 ముద్దాడ నవీన్ నుంచి 6 మోటార్ సైకిళ్లు రికవరీ చేశామని చెప్పారు. రికవరీ చేసిన బైక్‌లను కోర్టు ఆదేశాలతో బాధితులకు తిరిగి అందించేందుకు చర్యలు చేపడతామని ఎస్పీ ఈ సందర్భగా స్పష్టం చేశారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐ ఆర్వీఆర్కే చౌదరి ఆధ్వర్యంలో పని చేసిన వన్ టౌన్ క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు, హెచ్‌సీ ఎ.రమణారావు, కానిస్టేబుల్స్ ఎస్.గౌరీశంకర్, పి.శివశంకర్, టి.శ్రీనివాస్, పి.మంజులను ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

గ్రోమోర్ సెంటర్‌లో విజిలెన్స్ తనిఖీలు

- రూ.7.50 లక్షల విలువైన స్టాక్‌కు స్టాప్‌సేల్స్ ఆదేశాలు



గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న గ్రోమోర్ సెంటర్‌ను విజిలెన్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా బుధవారం తనిఖీ చేశారు. స్టాక్‌కు, ఈపాస్‌లో ఉన్న వివరాలు సమానంగా ఉన్నాయా? లేదా? కాలపరిమితి దాటిన ఎరువులు ఉన్నాయా? అని తనిఖీ చేశారు. మొక్కల ఎదుగుదలకు సంబంధించి వినియోగించే ఉత్ప్రేరకాలు కాలపరిమితి దాటడంతో రూ.7.50 లక్షలు విలువ చేసే స్టాక్‌కు స్టాప్ సేల్స్ ఆర్డర్స్ ఇచ్చారు. నెల రోజులలోగా స్టాక్‌కు సంబంధించి లైసెన్స్ రెన్యువల్ చేసుకోకపోతే 6ఎ కేసు నమోదు చేయాలని ఏఓ శ్యామ్‌కుమార్‌కు విజిలెన్స్ అధికారులు సూచించారు. ఈ తనిఖీల్లో పలాస ఏడీఏ రామారావు, విజిలెన్స్ ఎస్సై అప్పలనాయుడు పాల్గొన్నారు.

జనసేన నాయకుడి దౌర్జన్యం

- పొలం గట్టును కలిపేసి ఆపై రైతుపై దాడి
- ప్రతిఘటించిన బాధిత రైతు కుటుంబం
- ఇరు వర్గాలకు గాయాలు, ఆస్పత్రిలో చికిత్స
- ఆరాతీసిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద నారాయణపట్నం గ్రామంలో జనసేన మండల అధ్యక్షుడు పతివాడ అచ్చిం నాయుడు ఓ రైతు కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానికులు, ఎస్సై గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అచ్చిం నాయుడు, సామంతుల రమణల మధ్య కొంత కాలంగా పొలం గట్టు విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన నేత అచ్చిం నాయుడు మంగళవారం ఉదయం రమణ పొలాన్ని ఆక్రమించి గట్టు వేశాడు. ఇదే విషయమై రమణ ప్రశ్నించగా విచక్షణా రహితంగా దాడి చేయడంతో సామంతుల రమణతో పాటు చనమల్లు అరుణ్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం వారిద్దరూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. తమ వారిని గాయపరచడంతో అదే రోజు సాయంత్రం గ్రామంలో ఇరువర్గాల మధ్య మళ్లీ ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో అచ్చింనాయుడితో పాటు అవతలి వర్గంలోని పలువురికి గాయాలయ్యాయి.

తనపైనే దాడి అంటూ జనసేన నేత ప్రచారం

తొలుత రైతు కుటుంబాన్ని గాయపరిచిన జనసేన నేత అచ్చింనాయుడు అదేమీ లేదంటూ తనపైనే దాడి చేశారని రాజకీయ కోణంలో సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేశాడు. పోలీసులు వాస్తవాలను తెలుసుకోవడంతో సైలెంట్ అయ్యాడు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి గ్రామాన్ని సందర్శించి తగాదాపై ఆరా తీశారు. ఇది కేవలం పొలంలో తలెత్తిన గొడవేనని..రాజకీయానికి సంబంధం లేదని ఆమె గుర్తించారు. తమపై దాడి జరిగిన విషయాన్ని పూసగుచ్చినట్లు బాధిత వర్గం ఎమ్మెల్యేకు వివరించింది. దాడి జరిగినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, అన్యాయం జరిగినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉందని బాధిత వర్గాన్ని ఎమ్మెల్యే మందలించారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.



జనసేన నేత చేతిలో తలకు గాయాలైన చనమల్లు అరుణ్



గాయపడిన సామంతుల రమణ

విజయనగరం ఆర్టీసీ డిపో సందర్శన



ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఆర్టీసీ ఎం.డి ద్వారకా తిరుమలరావు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఎం,డి ద్వారకా తిరుమలరావు బుధవారం విజయనగరం ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్శనలో ఆయన ఆర్టీసీ డిస్పెన్సరీని మార్చడానికి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి, దాని సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేశారు. లాజిస్టిక్ కౌంటర్‌లను సందర్శించి బస్‌స్టేషన్‌కు వెళ్లి విద్యార్థులతో బస్సుల సమయపాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన డిపో సిబ్బందితో సమావేశమై వారి పనితీరును మెచ్చుకున్నారు. అంతేకాక విజయనగరం డిపో పరిధిలో ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉత్తమ సేవలందించిన సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా వారి కృషిని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెల 15 నుంచి మహిళలకు కల్పించే ఉచిత బస్సు ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు, ప్రస్తుతం నడుపుతున్న బస్సులను కూడా ఎలక్ట్రికల్ బస్సులుగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రయాణికుల సౌకర్యార్థం పల్లెవెలుగు బస్సులను పెంచుతామన్నారు. మహిళా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బ్రహ్మానందరెడ్డి, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ సీటీఎం జి.సత్యనారాయణ, డిప్యూటీ సీఎంఈ కొటాన శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా ప్రజా రవాణా అధికారిణి జి.వరలక్ష్మి, ఈఈ అరుణకుమార్, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

యూ విన్ పోర్టల్‌లో నమోదు చేయాలి



వెంకంపేటలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి పీఎల్ రఘు

పార్వతీపురం రూరల్: ఐదు సంవత్సరాల వయస్సు నిండిన పిల్లలందరినీ 'యూ విన్' పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా ప్రోగ్రాం అధికారి పీఎల్ రఘు అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం మండలంలోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వెంకంపేట ఏఏఎం వద్ద సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రోగులకు అందుతున్న సేవలు వాటి వివరాలను రికార్డులలో పరిశీలించారు. అలాగే జ్వరాలకు సంబంధించిన కేసుల వివరాలు పరిశీలించి మందుల లభ్యతపై ఆరా తీశారు.

విద్యను జాతీయం చేయాలి

- పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి



మాట్లాడుతున్న పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి

పార్వతీపురం రూరల్: ఆటంబాంబులు, సునామీల కంటే పేపర్ లీక్ సమాజానికి, వ్యవస్థకు ఎంతో హానికరం అని పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం వచ్చిన ఆయన ఆగస్టు 22న విడుదల కానున్న తన 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్' చిత్రం ప్రమోషన్ మేరకు జిల్లా కేంద్రంలోని పలువురు రాజకీయ నాయకులను పట్టణ ప్రముఖులను కలిశారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా విద్యారంగంలో జరుగుతున్న పేపర్ లీక్ వల్ల జరిగే నష్టాలను చర్చిస్తూ తాను యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమాను తెరకెక్కించినట్లు తెలిపారు. గ్రూప్ 1, 2 పరీక్షల్లో అలాగే పలు ప్రధాన పరీక్షల్లో ప్రశ్నపత్రాల్ని లీక్ చేయడం చూస్తుంటే విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలు ఏమైపోతాయో అనే భయం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాపీయింగ్ చేసి మార్కులు తెచ్చుకున్న వారు డాక్టర్లు అయితే రోగుల ప్రాణాలకు భరోసా ఉండదని, అలాంటి వాళ్లు ఇంజనీర్లు అయితే బ్రిడ్జిలు ఎలా నిలబడతాయని ఆర్.నారాయణమూర్తి ప్రశ్నించారు. ఇలాంటి దారుణాలు జరగకూడదంటే పేపర్ల లీక్‌లను అరికట్టాలని, విద్యను జాతీయం చేసి ప్రైవేట్ మాఫియా నుంచి విముక్తి చేయాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూగిరిజన మహిళ మృతి

పాచిపెంట: ఈ నెల ఏడవ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన పాచిపెంట మండలంలోని పి.కోనవలస పంచాయతీ పనసలపాడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ పెదకాపు జయమ్మ విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన పెదకాపు జయమ్మకు రవితో ఏడాది క్రితం వివాహం అయింది.

అనంతరం వారికి ఒక మగబిడ్డ పుట్టి అనారోగ్యకారణాలతో మరణించాడు. నాటి నుంచి మానసిక వేదనకు గురైన జయమ్మ తన భర్త ఇంట్లో లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తల్లి సామాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు.


దివ్యాంగులతో సదరంగం..!

- సర్టిఫికెట్స్ జారీలో అలసత్వం
- ఆస్పత్రిలో అటెండ్ అయి నెలలు గడుస్తున్నా కానరాని ఫలితం
- ఆందోళన చెందుతున్న దివ్యాంగులు
- స్పష్టమైన సమాధానం చెప్పని వైద్యాధికారులు

విజయనగరంఫోర్ట్: మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన పాలవలస స్వామినాయుడు అనే ఎముకల సంబంధిత దివ్యాంగుడు సదరం సర్టిఫికెట్ కోసం సచివాలయంలో స్లాట్ బుక్ చేసుకున్నారు. స్వామినాయుడికి 2024 డిసెంబర్ 10వతేదీన ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ కోసం అటెండ్ (హాజరు) అవ్వాలని వచ్చింది. దీంతో ఆ రోజున ఎస్. కోట ఏరియా ఆస్పత్రిలో అటెండ్ అయ్యాడు. ఆస్పత్రికి హాజరై 7 నెలలైంది. ఇంతవరకు ఆయనకు సదరం సర్టిఫికెట్ జారీ కాలేదు. ఆస్పత్రిలో అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వడంలేదని వాపోతున్నాడు.

ఈ ఒక్క దివ్యాంగుడే కాదు. అనేక మంది ఈ విధంగా సదరం సర్టిఫికెట్స్ జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని వాపోతున్నారు. అయితే చాలా మంది దివ్యాంగులు ఆస్పత్రికి వెళ్లాం కదా.. సదరం సర్టిఫికెట్ వస్తుందని ఎదురుచూస్తున్నారు. మరి కొంతమంది సదరం సర్టిఫికెట్స్ రాకపోతే ఎవరిని అడగాలో తెలియక మిన్నుకుండిపోతున్నారు.


సదరం సర్టిఫికెట్ కోసం ఆస్పత్రికి హాజరైన వారికి వారం, 10 రోజుల్లో జారీ కావాల్సి ఉంది. కానీ నెలలు గడుస్తున్నా సర్టిఫికెట్స్ అందడంలేదని తెలుస్తోంది.



స్వామినాయుడికి 2024 డిసెంబర్ 10న ఆస్పత్రికి అటెండ్ కావాలని బుక్ అయిన స్లాట్

సదరం సర్టిఫికెట్ ఈ విధంగా జారీ..

కంటి, ఎముకలు, న్యూరో, ఈఎన్‌టీ, మానసిక విభాగాలకు చెందిన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ జారీ చేస్తారు. సంబంధిత విభాగాలకు చెందిన దివ్యాంగులు అధార్ కార్డుతో లింక్ అయిన ఫోన్ నంబర్‌తో సంబంధిత సచివాలయాలనికి స్లాట్స్ బుక్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చినప్పుడు సచివాలయానికి వెళ్తే అక్కడ ఆయా విభాగాలకు ఏ ఆస్పత్రికి వెళ్లాలో స్లాట్స్ బుక్ చేస్తారు. ఆ తేదీన ఆస్పత్రికి వెళ్తే ఆయా విభాగానికి చెందిన వైద్యుడు దివ్యాంగుడిని పరీక్షించి వైకల్యం ఎంత ఉందో రాసి సదరం సర్టిఫికెట్ జారీ చేస్తారు. సదరం సర్టిఫికెట్ (పర్మినెంట్) శాశ్వతంగా ఉంటేనే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. తాత్కాలిక సర్టిఫికెట్ అయితే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉండదు. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సదరం సర్టిఫికెట్స్ జారీలో జాప్యం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రుల్లో సర్టిఫికెట్ జారీ చేయడంలో వైద్యులు అలసత్వం వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సదరం సర్టిఫికెట్

జిల్లాలో 36 వేల మందికి దివ్యాంగుల పింఛన్

జిల్లాలో 36 వేల మందికి పైగా దివ్యాంగులు పింఛన్ పొందుతున్నారు. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత దివ్యాంగ పింఛన్లు పొందే వారికి పింఛన్ రీ వెరిఫికేషన్ చేయిస్తోంది. దీంతో దివ్యాంగులంతా ఆయా ఆస్పత్రులకు రీ వెరిఫికేషన్‌కు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క దివ్యాంగ పింఛన్ కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవు.

విచారణ చేసి చర్యలు

సదరం సర్టిఫికెట్‌కు దివ్యాంగుడు ఆస్పత్రికి హాజరైన 10, 15 రోజుల్లో జారీ చేయాలి ఎందుకు జాప్యం జరుగుతోందో విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ ఎస్.పి. పద్మశ్రీ రాణి, డీసీహెచ్‌ఎస్

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹160